క్లుప్తంగా

రైతులు ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలి



కొక్కిలిగడ్డ(మోపిదేవి): ప్రభుత్వం రైతాంగానికి కల్పిస్తున్న ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలని జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు అన్నారు. కొక్కిలిగడ్డ మల్టీపర్పస్ గోడౌన్ వద్ద సర్పంచ్ దిడ్ల జానకీరాంబాబు ఆధ్వర్యాన రైతులకు ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఖేతావత్తుల లీల, ఎంపీటీసీ దిడ్ల రాణి, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు, కె. కొత్తపాలెం సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి, ఉప సర్పంచ్ ముమ్మనేని బాబూరావు, కెడీసీసీ బ్యాంకు బ్రాంచి మేనేజర్ సల్మా సుల్తానా సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

మచిలీపట్నంటౌన్: వాసవీ ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యాన గురువారం స్థానిక అన్నం రాఘవయ్య కల్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వాసవీక్లబ్, వాసవీ వనిత క్లబ్, వాసవీ కపుల్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించిన వైద్యశిబిరంలో 75 మంది రోగులకు పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందజేశారు. పార్ధ డెంటల్‌కేర్‌కు చెందిన చిన్నపిల్లల దంత వైద్యనిపుణులు పవన్, ఎముకల వైద్యురాలు ఐశ్వర్య, జిల్లా సర్వజన ఆసుపత్రి వైద్యుడు యార్లగడ్డ సుబ్రహ్మణ్యం రోగులకు వైద్యసేవలు అందించారు. క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతుబజారులో తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు

పెడనలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు

పెడన: రాష్ట్రంలో ధరల స్థిరీకరణకు ఎన్డీఏ కూటమి పటిష్ట చర్యలు చేపట్టిందని, అందులో భాగంగానే రైతుబజార్లలో తక్కువ ధరకు కందిపప్పు, బియ్యం అందిస్తున్నామని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. పెడన రైతుబజారులో గురువారం సాయంత్రం తక్కువ ధరలకు బియ్యం, కందిపప్పు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బయట మార్కెట్‌లో కందిపప్పు రూ.181 ఉంటే రైతుబజారులో కౌంటరులో రూ.160కే ఇస్తారన్నారు. స్టీమ్ రైస్ రూ.55లున్నది రూ.49కి, రా రైస్ రూ.48కి లభిస్తాయన్నారు. మచిలీపట్నం రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన కౌంటరును ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్జా వెంకట నగేష్, అబ్దుల్‌ఖయ్యూం(హన్ను), శెలపాటి ప్రసాద్, శీరంప్రసాద్, కౌన్సిలర్ శివపావని, కూనపురెడ్డి రంగయ్య తహసీల్దార్ రాంబాబు, ఆర్‌ఐ మణికుమార్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యానాదుల ఇళ్ల వద్ద తూముల ఏర్పాటు



మోపిదేవి: మోపిదేవి లే అవుట్ 3 లో యానాదుల ఇళ్ల ఎదుట డ్రైనేజీ ఏర్పాటు చేసి మురుగునీరు నిల్వలేకుండా చేసినట్లు తహసీల్దార్ శ్రీవిద్య తెలిపారు. వర్షాలను దృష్టిలో పెట్టుకుని నీరు నిల్వలేకుండా గురువారం పంచాయతీ నిధులతో తాత్కాలికంగా డ్రైనేజీ తవ్వించి తూములు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. త్వరలోనే మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ వివరించారు. జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరావు, వీఆర్వోలు, సచివాలయ అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

బారా ఇమామ్ పంజాలో ప్రార్థనలు



గూడూరు: మొహర్రం పురస్కరించుకుని గూడూరులోని బారా ఇమామ్ పంజాలో గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పంజా కార్యదర్శి మున్వర్ పాషా ఆధ్వర్యంలో సోమవారం పంజాలో పీర్లను ప్రతిష్ఠ నిర్వహించారు. అప్పటి నుంచి నిత్యం పంజాలో జరుగుతున్న ప్రార్థనలు ఈ నెల 17వ వరకు కొనసాగుతాయని పాషా తెలిపారు.

పాఠశాలల్లో అభివృద్ధి పనుల పరిశీలన

కృత్తివెన్ను: పాఠశాలల్లో జరిగిన అభివృద్ధిని సంబంధిత అధికారులు గురువారం పరిశీలించారు. మండలంలోని పల్లెపాలెం, పోడు, నీలిపూడి భవిత కేంద్రం, ప్రాథమిక పాఠశాలలను పరిశీలించి సూచనలు చేశారు. పరిశీలనలో సెక్టోరియల్ అధికారి సుభాని, ఏఎస్‌వో నగేష్, ఐఈడీ కో ఆర్డినేటర్ రాంబాబు, ఎంఈవో ప్రసాదరావు, ఉపాధ్యాయులు ఏసుపాదం, సూర్యప్రకాష్ ఉన్నారు.

ఇంటికి ఒక్కరికేనా..?

- తల్లికి వందనం కోసం ఎదురుచూపులు
- పిల్లల ఫీజులు, పుస్తకాల కొనుగోళ్లకు ఉపయోగపడతాయనే ఆశ
- ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి అన్న కూటమి నాయకులు
- గతేడాది 'బందరు'లో 17 వేల మంది తల్లుల ఖాతాల్లో అమ్మఒడి జమ
- ఈ ఏడాది విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు 32,466



కూటమి మేనిఫెస్టోలో 'తల్లికి వందనం' కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని ప్రకటన

మచిలీపట్నంటౌన్: 'ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు'ఇస్తామని ఎన్నికల ముందు కూటమి అగ్రనేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. దాన్ని మేనిఫెస్టోలో కూడా ప్రముఖంగా ఇచ్చారు. మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల్లోని విద్యార్థుల తల్లిదండ్రులు ఈ హామీ ఎప్పుడు నెరవేరుతుందోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే దీనిపై ప్రభుత్వం జీవో ఇవ్వడం.. దానిలో ఒక్కరికే పథకం వర్తిస్తుందని ప్రచారం జరుగుతుండటంతో తల్లులు ఆందోళన చెందుతున్నారు. జూన్ 13నుంచి పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. పాఠశాలలు ప్రారంభమై దాదాపు నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వ పెద్దలు 'తల్లికి వందనం' పథకం ద్వారా రూ. 15 వేలు ఇంకా వేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. స్కూళ్ల తెరిచి పాఠాలు ప్రారంభం కావడంతో అప్పులు చేసి మరీ పిల్లలకు పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్‌లు కొనుగోలు చేశామని ప్రభుత్వం ఈ పథకం ద్వారా డబ్బులు తమ ఖాతాల్లో జమ చేస్తే అప్పులు తీర్చాలని చూస్తున్నామని చెబుతున్నారు. ప్రభుత్వ జీవో, ప్రస్తుతం సోషల్ మీడియాలో వస్తున్న ప్రకటనతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

మచిలీపట్నం నియోజకవర్గంలో ఇలా...

మచిలీపట్నం నియోజకవర్గంలోని ప్రైవేటు పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరంలో సుమారు 20 వేల మంది, ప్రభుత్వ పాఠశాలల్లో 12,466 మంది మొత్తం 32,466 మంది విద్యార్థులు చదువుతున్నారు. తల్లికి వందనం పథకం ద్వారా వీరందరికీ రూ.15వేల చొప్పున తల్లుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ. 48.69 కోట్లు జమ చేయాల్సి ఉంది. గత ప్రభుత్వం హయాంలో 2023–24 విద్యాసంవత్సరంలో ప్రభుత్వం చెప్పిన విధంగా జూన్‌లోనే నియోజకవర్గంలో దాదాపు 17 వేల మంది విద్యార్థులకు అమ్మఒడి ద్వారా తల్లుల ఖాతాల్లో రూ. 13 వేలు చొప్పున జమయ్యాయి.

ఎంతో ఆశతో టీడీపీకి ఓటేశాం.. ఇప్పుడేమో..

పెడన: ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాకముందు ఎన్నికల ప్రచారంలో భాగంగా పెడనకు విచ్చేసిన కూటమిలోని అగ్రనాయకులు నారా చంద్రబాబు, పవన్ కల్యాణ్ కూడా. ఇంట్లో ఎంత మంది ఒకటి నుంచి ఇంటర్ సెకండ్ ఇయర్ వరకు చదువుకుంటున్న వారుంటే అందరికీ తల్లికి వందనం పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. 2024 ఏప్రిల్ 17న పెడనకు వచ్చిన వీరు హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం చంద్రబాబునాయుడు సీఎం, పవన్ కల్యాణ్ ఉపముఖ్యమంత్రి అయ్యారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం తల్లికి వందనం పథకం విషయంలో ఎన్డీయే కూటమి జారీ చేసిన జీవో ప్రకారం ఇంట్లో ఎంత మంది ఉన్నా (ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్నవారు) ఒకరికి మాత్రమే పథకం వర్తింపజేసేలా జీవో జారీ చేశారు. పెడన నియోజకవర్గంలోని ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న వారి సంఖ్యను పరిశీలిస్తే సుమారు 23వేలకు పైగా ఉన్నారు. పెడన మండలంలో 8,468, కృత్తివెన్నులో 4,576, బంటుమిల్లిలో 6,789, గూడూరులో 3,484 మంది ఉన్నారు. ఇవి కూడా ప్రస్తుతం ఎన్‌రోల్‌మెంటు ప్రకారం అధికారికంగా విద్యాశాఖాధికారులు ప్రకటించారు ఈ వివరాలు. ఈ సంఖ్య ఇంకా పెరగవచ్చనే విషయాన్ని వారు పేర్కొంటున్నారు. 23వేల మందికిపైగా తల్లికి వందనం నిధులు విడుదల చేయాల్సి ఉంది.

అందరికీ న్యాయం జరుగుతుందనే నమ్ముతున్నాం



నాకు ఇద్దరు పిల్లలు. పెద్ద బాబు ప్రైవేటుస్కూల్లో నాలుగో తరగతి చదువుతున్నాడు. పాప ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతుంది. చంద్రబాబు న్యాయం చేస్తారని నమ్ముతున్నాం. పిల్లలందరికీ తల్లికి వందనం డబ్బులు వేస్తారని ఎదురు చూస్తున్నాం. – నీలకంఠం స్వాతి, మచిలీపట్నం

చంద్రబాబు న్యాయం చేస్తారు



నాకు ఇద్దరు పిల్లలు. పెద్దబాబు ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. చిన్న బాబు ఆరో తరగతి చదువుతున్నాడు. ఎన్నికల ముందు తల్లికి వందనం ఇస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. చంద్రబాబు న్యాయం చేస్తారు.

–వడ్లమూడి పల్లవి, మచిలీపట్నం

ఇద్దరికి కాదా..



నాకు ఇద్దరు పిల్లలు. ఒకరు కేంద్రీయ విద్యాలయంలో ఆరో తరగతి చదువుకుంటుంది. మరొకరు పల్లోటి పాఠశాలలో నాలుగో తరగతి చదువుకుంటుంది. వీరిద్దరికీ తల్లివందనం వస్తుందని ఆశతో ఉన్నా. ఇప్పుడేమో ఒక్కరికే అంటున్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటే వారందరికి ఇస్తామన్నారు. ఇద్దరికీ ఇస్తే బాగుండు.

–పదమట వేదగోవిందవిజయశ్రీ, పెడన

ఎన్నికల ముందు హామీ ఇచ్చారు



రెక్కలపై ఆధారపడ్డ కుటుంబం మాది. ఇద్దరు కుమారులు. ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి ఎంతమంది పిల్లలుంటే వారందరికీ ఫీజులు ఇస్తామని చెప్పింది. ఇచ్చిన హామీని నిరాశ పరచకుండా అమలు చేసి మా లాంటి పేదలకు విద్యాభివృద్ధిలో అండగా నిలవాలి. కుమారులు స్థానిక ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు.

–కె. నాగప్రమీల, జానకీరామపురం

ఎంతో ఉత్సాహంగా మద్దతిచ్చా



నాకు ఇద్దరు పిల్లలు. కొంకేపూడిలోని పల్లోటి ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నారు. ఒకరు మూడో తరగతి, మరొకరు ఒకటో తరగతి. వీరిద్దరికి కూడా తల్లివందనం కింద నిధులు వస్తాయని ఎంతో ఉత్సాహంతో టీడీపీకీ మద్దతుగా నిలిచా. ఇప్పుడేమో ఒక్కరికే అంటున్నారు. చాలా బాధగా ఉంది.

–వంకా సౌమ్య, పెడన

హామీని నిలుపుకోవాలి



రోడ్డు మార్జిన్‌లో హోటల్ వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నాం. టీడీపీ కూటమి.. ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం ఇస్తామని హామీ ఇచ్చింది. బాబు, పాప ఉన్నారు. స్థానిక ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం ఇస్తామని చెప్పడంతో నమ్మి టీడీపీకి ఓట్లు వేశాం. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీని అమలు చేసి మాలాంటి పేద కుటుంబాలను ఆదుకోవాలి.

– వి. కల్యాణి, బంటుమిల్లి

నిబంధనలతో ఇద్దరు పిల్లలున్న తల్లిదండ్రుల్లో ఆందోళన

అవనిగడ్డ: 'మేము అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటున్నా అందరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేస్తామని' చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చెప్పారు. పామర్రు బహిరంగసభలో చంద్రబాబు, అవనిగడ్డ పర్యటనలో పవన్‌కల్యాణ్ దీనిపై స్పష్టమైన హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఇవ్వనున్న తల్లికి వందనం పథకం ఇంట్లో ఒకరికి మాత్రమే వర్తిస్తుందనే తాజా నిబంధనలతో ఇద్దరు పిల్లలున్న తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.

19,964 మంది ఎదురుచూపులు

అవనిగడ్డ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలు 255 ఉన్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 180, యూపీ స్కూల్స్ 37, హైస్కూల్స్ 38 ఉన్నాయి. ప్రైవేటు ప్రాథమిక పాఠశాలలు 22, 14 యూపీ స్కూల్స్, 25 హైస్కూల్స్ ఉన్నాయి. వీరిలో తల్లికి వందనం పథకం ద్వారా అర్హులైన వారు 19,964 మంది ఉన్నారు. కూటమి పార్టీల హామీ మేరకు వీరందరికీ పథకం అమలు చేయాల్సి ఉంది. తాజా నిబంధనల ప్రకారం వీరిలో ఎంతమందికి పథకం వర్తిసుందో తెలియక తల్లితండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఠంఛన్‌గా ఖాతాల్లోకి..

గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో స్కూల్స్ ప్రారంభించిన తర్వాత అదేనెలలో అమ్మ ఒడి పథకం తల్లుల ఖాతాల్లోకి జమచేసేవారు. 2022లో 19,266 మంది విద్యార్థులకు అమ్మఒడి పథకం ద్వారా రూ.28.89 కోట్లు తల్లుల ఖాతాలకు జమచేయగా, 2023లో 18,282 మంది విద్యార్థులకు రూ.27.42 కోట్లు జమచేశారు. ఈ ఏడాది జూలై వచ్చినా తల్లుల ఖాతాల్లోకి డబ్బులు జమ కాకపోవడం, తల్లికి వందన ఎప్పుడు అందుతుందో కూడా తెలియక తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

కోడూరు: నియోజకవర్గంలో అసాంఘిక కార్యకలాపాలపై అధికారులు ఉక్కుపాదం మోపాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రభుత్వ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వ్యవహరించేవారిని ఉపేక్షించవద్దని, అధికారులకు అండగా ఉంటానని బుద్ధప్రసాద్ తెలిపారు. గ్రామాల అభివృద్ధికి పంచాయతీ, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. పంచాయతీ నిధుల్లో కొరత ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యశాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సురక్షిత తాగునీరుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉద్యోగులు విధి నిర్వహణలో గుర్తింపు తెచ్చుకోవాలని చెప్పారు.

- బుద్ధప్రసాద్‌ను ఎంపీపీ వెంకటకుమారి, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు శాలువా కప్పి సత్కరించారు.

సాగునీటి కోసం ఎదురుచూపులు



యండపల్లి వద్ద ఉన్న కొద్దిపాటి నీటిని ఆయిల్ ఇంజిన్‌తో నారుమడికి తోడుకుంటున్న రైతు

కృత్తివెన్ను: మండలంలో రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు అధికశాతం రైతాంగం ఖరీఫ్ సాగులో నారుమడులు వేసుకున్నారు. వీటికి మొక్కతడి అవసరం ఉంది. ఈ క్రమంలో వర్షాలు ముఖం చాటేయడం, కాల్వల ద్వారా నీరు రాకపోవడంతో రైతులు ఇప్పుడు నీటి కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి తలెత్తింది. మరో రెండు మూడు రోజుల్లో కాల్వల ద్వారా సాగునీరందించాల్సిన అవసరం ఉందని లేకపోతే వరుణదేవుడే దిక్కని రైతులు అంటున్నారు. కృత్తివెన్ను మండలంలో తాగునీటి చెరువులు కూడా అడుగంటి పోయాయి. తాగునీటికి కూడా ప్రజలు అల్లాడిపోతున్నారు. కొన్నిచోట్ల కొద్దిపాటి నీటిని ఇంజిన్ల ద్వారా తోడుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు

కోడూరు: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఐదుగురు జెడ్పీ పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. మండలంలోని స్వతంత్రపురం చామర్తి ప్రకాశరాయ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన యర్రారెడ్డి ఉజ్వల (నూజివీడు ట్రిపుల్ ఐటీ), ఆరిగ అఖిల్ (నూజివీడు), జరుగు లోహిత (శ్రీకాకుళం), ఈర్ల శ్రీనివాస్ (ఒంగోలు), పులి విష్ణుప్రియ (శ్రీకాకుళం) ట్రిపుల్ ఐటీ సీట్లు దక్కించుకున్నారు. వీరందరూ ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో సీటు సాధించారని హెచ్‌ఎం ఆలా వెంకటరమణ తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థులతో పాటు వీరికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంఈఓలు టి.వి.ఎం. రామదాసు, శ్రీనివాసరావు అభినందించారు.

పెడన: చెన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పది ఫలితాల్లో 567 మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన పోతన చంద్రికను పాఠశాల హెచ్‌ఎం ఎస్.సౌజన్య అభినందనలు తెలిపారు.

నాగాయలంక: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్‌లో చదివి 2024–పదో తరగతి ఫలితాల్లో 571 మార్కులు పొందిన బాలిక కోసూరు శ్రియ (నంగేగడ్డ గ్రామం) ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం పీవీఎస్‌వీ ప్రసాద్ గురువారం తెలిపారు.

పెడన ప్రధాన రహదారిలో కొలతలు



ప్రధాన రహదారి పక్కన కొలతలు వేస్తున్న మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది

పెడన: పట్టణంలోని ప్రధాన రహదారిలో మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది గురువారం ఉదయం కొలతలు వేయడంతో వ్యాపారులు తీవ్ర ఆందోళన చెందారు. దీనిపై ఆరా తీయడం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య మాట్లాడుతూ 15 ఏళ్లకు ఒకసారి మాస్టర్ ప్లాన్ రివైజ్ చేయాల్సి ఉంటుందని, అందులో భాగంగానే పట్టణంలో ప్రధాన రహదారి కొలతలు వేస్తున్నారని వివరించారు. బంగ్లాస్కూలు నుంచి బంటుమిల్లి రోడ్డు సెంటర్ వరకు బంటుమిల్లి రోడ్డు సెంటరు నుంచి బంటుమిల్లి రోడ్డులోని మాంసం దుకాణాల సెంటరు వరకు అక్కడ నుంచి మఠం వైపుగా బంగ్లాస్కూలు రోడ్డు వరకు కొలతలు వేశారు. ప్రధాన రహదారి 13 మీటర్లకుగాను తొమ్మిది మీటర్లు ఉన్నట్లు గుర్తించారు. మఠంవీధి నుంచి బంగ్లాస్కూలు రోడ్డు కూడా 9 మీటర్లు ఉండేలా కొలతలు వేసి మార్క్ చేసినట్లు సిబ్బంది మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేశారు.

మర్యాదపూర్వక కలయిక



కోనేరుసెంటర్: బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరిని ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మచిలీపట్నంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆర్ అండ్ బి అతిథిగృహంలో ఎంపీని కలిసిన ఎస్పీ మొక్కను అందజేశారు. జిల్లాలో శాంతిభద్రతలపై చర్చించారు.

వివరాలన్నీ పీఆర్ యాప్‌లో నమోదు

మోపిదేవి: వానాకాలం దృష్ట్యా 90 రోజుల ప్రోగ్రాంను విజయవంతం చేయాలని ఈవోపీఆర్డీ అశోక్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సాయంత్రం గ్రామ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్‌తో ఇన్‌చార్జి ఎంపీడీవో రామలింగేశ్వరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ కమిషనర్ పర్యవేక్షణలో పంచాయతీ ఆధ్వర్యాన చేపట్టే పలు అభివృద్ధి పనులు పీఆర్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. శానిటేషన్, మంచినీరు ఏర్పాటు, పైప్‌లైన్, పంపులు ఏర్పాటు వంటివన్నీ యాప్‌లో నమోదు చేస్తే మీరు ఏ ప్రాంతం నుంచి పనిచేస్తుందీ కూడా యాప్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. యజమాని పేరు, డోర్ నంబర్లలో తప్పులను సరి చేస్తే ఇంటి పన్ను సమయంలో ఎలాంటి సమస్యలు ఉండవని స్పష్టం చేశారు.

అధిక జనాభా ఆందోళనకరం

బంటుమిల్లి: దేశంలో పెరుగుతున్న అధిక జనాభా ఆందోళన కలిగించే విషయమని పెదతుమ్మిడి వైద్యాధికారి సువర్చల అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం వైద్య సిబ్బందితో కలసి అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎం.దాసు, ఏడుకొండలు, కమలరత్నం, యునాస్, రాజారావు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వారాహి.. వందనం



పీఠంపై ధూమ్ర వారాహిదేవి

నాగాయలంక: స్థానిక కృష్ణానదీ తీరంలోని శ్రీరామ పాదక్షేత్రం దేవాలయాల సముదాయంలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో జరుగుతున్న శ్రీవారాహి అమ్మవారి ఆషాఢ గుప్త నవరాత్రి ఉత్సవాల్లో గురువారం అమ్మవారు ధూమ్ర వారాహి (మహేశ్వరి)దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ముదునూరి శ్రీనివాసశాస్త్రి, అచ్యుత శేఖరశర్మ నేతృత్వంలో తెల్లవారుజామున 4గంటలకు వారాహి అమ్మవారిని ధూమ్ర వారాహి మాతగా అలంకరించి విశేష కుంకుమ పూజ చేశారు. క్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలాకృష్ణప్రసాద్(బుజ్జి) బోయపాటి రాము, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కె. కొత్తపాలెం(మోపిదేవి): కె. కొత్తపాలెంలోని శ్రీ దుర్గా కోటేశ్వరస్వామి ఆలయంలో వారాహి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ ప్రధానార్చకులు విద్యాసాగర్ శర్మ బ్రహ్మత్వంలో గురువారం ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు.

శివనామస్మరణతో మార్మోగిన జలధీశ్వరస్వామి ఆలయం

ఘంటసాల: ఘంటసాలలోని శ్రీ బాలపార్వతీ సమేత జలధీశ్వరస్వామి దేవస్థానం శ్రీను గురుస్వామి శివనామ స్మరణతో మార్మోగింది. గుంటూరు జిల్లా మూరతోట గ్రామానికి చెందిన ప్రముఖ శ్రీను గురుస్వామి అయ్యప్ప స్వామి భక్తి గీతాలు ఆలపించడంతో పాటు భజనలు చేస్తూ కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పేరొందారు. దానిలో భాగంగా కృష్ణాజిల్లా ఘంటసాల గ్రామంలో శ్రీబాలపార్వతీ సమేత జలధీశ్వర స్వామి ఆలయాన్ని గురువారం సందర్శించి స్వామి వార్లకు అర్చకులు చావలి కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

కోడూరుకు బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

కోడూరు: కోడూరు మండలంలో విధులు నిర్వహించే ఉద్యోగులకు బస్సు సౌకర్యం కల్పించాలని గురువారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు పలువురు ఉద్యోగులు వినతిపత్రం అందించారు. ఇతర ప్రాంతాల నుంచి సుమారు 30 మందికి పైగా ఉద్యోగరీత్యా కోడూరుకు వస్తున్నారని, సమయానికి బస్సు లేకపోవడంతో వీరు ఇబ్బంది పడుతున్నట్లు బుద్ధప్రసాద్‌కు వివరించారు. అవనిగడ్డ డిపో నుంచి ఉదయం 9 నుంచి 11గంటల వరకు కోడూరుకు బస్సు సౌకర్యం లేదని, దీంతో సమయానికి విధులకు హాజరు కాలేకపోతున్నామని వాపోయారు. ద్విచక్ర వాహనాలపై రావాలంటే రహదారి పరిస్థితి కూడా బాగోలేదన్నారు. ఉదయం 9 నుంచి 9.30 గంటల మధ్యలో కోడూరుకు రెండు సర్వీసులు నడపడానికి చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు బుద్ధప్రసాద్‌ను కోరారు. దీనిపై స్పందించి ఎమ్మెల్యే అవనిగడ్డ డిపో అధికారులు ఈ విషయంపై దృష్టి సారించాలని ఆదేశించారు.

రైతులకు కేవీకేల సేవలు

ఘంటసాల: రైతులకు వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించడంలో కృషి విజ్ఞాన కేంద్రాలు విశేషమైన కృషి చేస్తున్నాయని ఘంటసాల కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత అన్నారు. దేశంలో కేవీకే స్థాపించి 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా నిర్వహిస్తున్న స్వర్ణోత్సవాల్లో భాగంగా స్వర్ణోత్సవ జ్యోతియాత్ర చేస్తున్నారు.

ఘంటసాల కేవీకే నుంచి స్వర్ణోత్సవ జ్యోతిని ఎన్టీఆర్ జిల్లా గరికపాడు కేవీకే శాస్త్రవేత్తలకు అందించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ బి.నవీన్, డాక్టర్ వి.మంజువాణి, డాక్టర్ కె.రేవతి, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అవనిగడ్డ: స్థానిక పాత విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ని ఏర్పాటు చేయనుండటంతో మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో పలుసార్లు అంతరాయం కలుగుతుందని ఉయ్యూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.కృష్ణనాయక్ గురువారం తెలిపారు. ఇక్కడున్న 3 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 5 ఎంవీఏను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో అవనిగడ్డలోని కొంతప్రాంతం, పులిగడ్డ, మోదుమూడి, అశ్వరావుపాలెం, రామచంద్రపురం, దక్షిణ చిరువోలులంక గ్రామాల్లో విద్యుత్‌కు పలుసార్లు అంతరాయం కలుగుతుందని వివరించారు.

నూతన భవనంలోకి పోస్టాఫీస్

కృత్తివెన్ను: పోస్టాఫీస్ నూతన బ్రాంచి కార్యాలయాన్ని గురువారం గుడివాడ పోస్టల్ సూపరింటెండెంట్ చల్లా అప్పారావు ప్రారంభించారు. కృత్తివెన్నులో గతంలో కొనసాగుతున్న పోస్టల్ కేంద్రాన్ని నూతన భవనంలోకి మార్చి ప్రారంభించినట్లు కృత్తివెన్ను ఎస్‌పీఎం ఎస్. శ్యామ్ తెలిపారు. అప్పారావు మాట్లాడుతూ పోస్టల్ శాఖ ద్వారా ఎన్నో ప్రయోజనాలను ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కైకలూరు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్, ఎంటీఎస్‌లు దుర్గాప్రసాద్, మోహన్ వర్మ తదితరులు పాల్గొన్నారు.